క్లుప్తంగా

జస్ట్ డయల్‌లో 35 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: హైద్రాబాద్‌కు చెందిన జస్ట్ డైయల్ సంస్థ తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 35 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కళాశాలకు చెందిన 165 మంది విద్యార్థులు ఆన్‌లైన్ టెస్ట్‌లో ఉత్తీర్ణులయ్యారు. వీరికి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఉద్యోగాలకు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన వారికి రూ.2.8 లక్షలు వేతనంతో పాటు అలవెన్స్‌లు అందజేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన



నాదెండ్ల: యడ్లపాడు మండలం మైదవోలు, చిలకలూరిపేట రూరల్ కుక్కపల్లివారిపాలెం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా రెండు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు భూమి పూజ నిర్వహించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. మైదవోలు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి, కుక్కపల్లిరపాలెం గ్రామంలో రూ.12 లక్షలలో రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, యడ్లపాడు మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబా, రూరల్ అధ్యక్షుడు జవ్వాజి మదన్, జనసేన ఇన్‌చార్జి తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి అర్జీల స్వీకరణ



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో సోమవారం సచివాలయం వద్ద గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ ధనలక్ష్మీ, మండల సర్వేయర్ రాంబాబు, వీఆర్వో యంపరాల నాగేంద్రబాబు, గ్రామ సర్వేయర్ వసంతరావు హాజరయ్యారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూ కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ 40 మంది రైతులు అర్జీలు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

యడ్లపాడు...

మండలంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో సోమవారం సచివాలయాల వద్ద గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెండు గ్రామాల నుంచి 54 అర్జీలు అందాయి. తహసీల్దార్ విజయశ్రీ, డీటీ అనురాధ, ఆర్ఐ జయరాజు, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, వీఆర్వో చారి హాజరయ్యారు. రైతుల నుంచి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నరసరావుపేటటౌన్: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ సోమవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన సాతులూరు రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల్లో చేర్పించారు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పరుచూరి ఝాన్సీ లక్ష్మీ పదకొండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అన్నదానం చేశారు. వృద్ధుల పట్ల ప్రతి వారు ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని పరుచూరి శివరాంప్రసాద్ శ్రీనివాసరావు, పరుచూరి పూర్ణ చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కొమ్మవరపు రుషిత తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో... కూతపెట్టని రైళ్లు



పేరుకు మాత్రం పెద్ద జంక్షన్. కానీ పెద్ద రైళ్లేవీ ఇక్కడ ఆగకుండా పరుగులు తీస్తాయి. రోజులో 12 రైళ్లు ఈ స్టేషను మీదుగా రాకపోకలు సాగిస్తున్నా కేవలం రెండు రైళ్లు మాత్రమే శావల్యాపురంలో ఆగుతున్నాయి.

- పేరుకే రైల్వే జంక్షన్
- ఆగకుండా పరుగులు తీస్తున్న రైళ్లు!
- కరోనాకు ముందు అన్నీ ఆగేవి!
- కోట్లు వెచ్చించి స్టేషన్ అభివృద్ధి
- కానీ సామాన్యుడికి అందని రైలు ప్రయాణం



శావల్యాపురం రైల్వే స్టేషను

శావల్యాపురం: శావల్యాపురం రైల్వేస్టేషను పేరుకే జంక్షన్... కానీ రోజులో ఉదయం, సాయంత్రం సమయాల్లో రెండు రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఇక ఏ రైలూ ఇక్కడ ఆగదు. ఈ స్టేషను పరిధిలో నిత్యం 12 ప్రయాణికులు రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయి. స్టేషను చుట్టుపక్కల 14 గ్రామాలు ఉండగా రైల్వే స్టేషను పరిధిలో ఒక్కో గ్రామం 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఉండగా నిత్యం వివిధ పనులపై గుంటూరు–మార్కాపురం, హుబ్లీ, కాచిగూడ, తిరుపతి, డోన్, ఔరంగాబాదు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైళ్లు ఇక్కడ నిలపకపోవడంతో మండల వాసులు బస్సులను ఆశ్రయిస్తున్నారు. గతంలో రైల్వే ఉన్నతాధికారులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శావల్యాపురం రైల్వే స్టేషను సందర్శించినప్పుడు ఈ స్టేషన్లో రైళ్లు నిలుపుదల చేయాలని స్థానికులు వివిధ పార్టీలకు చెందిన నేతలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఆర్టీసీ బస్సు చార్జీలు కంటే రైలు చార్జీలు తక్కువగా ఉంటాయని, అయితే రైలు ఎక్కుదామంటే రైలు ఆగదని మాటతో ప్రయాణికులు సరిపుచ్చుకుంటున్నారు. మొత్తం మీద రైలు ప్రయాణం పేదలకు అందని ద్రాక్ష వలే మారింది. గతంలో నామమాత్రంగా రెండు రైల్వే ట్రాక్‌లు ఉన్న సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు సైతం నిలిచేవి. కరోనా తర్వాత ప్రస్తుతం రెండు రైళ్లు నిలుపుదల చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో కోట్లు వెచ్చించి నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే మార్గం, డబల్ ట్రాక్ పనులు పూర్తి కావటంతో పాటు రైల్వే ఉన్నతాధికారులు విద్యుత్ రైల్వే ట్రాక్‌ను చెకింగ్ చేసి రైళ్ల రాకపోకలకు అనుమతులు జారీ చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ గూడ్స్ రైళ్లు మాత్రమే తిరుగుతున్నాయి. నడికూడి వయా శావల్యాపురం మీదగా హైదరాబాదు వరకు రైళ్లు నడపాలని రైల్వే అధికారులు మాత్రం నేటి వరకు చొరవ తీసుకోలేదు. శావల్యాపురం రైల్వే స్టేషనులో జంక్షన్‌కు సంబంధించిన అన్నీ రకాల ఏర్పాట్లు చేసి జంక్షన్‌గా ప్రకటించినప్పటికీ రైళ్లు నిలుపుదల చేయటంలో అధికారులు మాత్రం చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి గతంలో మాదిరిగానే అన్నీ రైళ్లు నిలుపుదల చేసి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు సైతం రైలు ప్రయాణం చేయాలని రైల్వే ఉన్నతాధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

రైలు దూరం కావటం బాధకరమే



బీజేపీ ప్రభుత్వ హయాంలో పేదలు రైలు ప్రయాణానికి దూరం కావటం చాలా బాధాకరం. గతంలో కరోనాకు ముందు శావల్యాపురం రైల్వే స్టేషనులో అన్నీ రైళ్లు ఆగాయి. వందే భారత్ వంటి రైళ్ల వల్ల కార్పొరేటు వ్యవస్థలకు లాభం. వారికి తొత్తులుగా బీజేపీ ప్రభుత్వం మారింది. రైల్వే లైను ఏర్పాటుకు కోట్లు వెచ్చించి నిరుపేదల రైతుల నుంచి భూసేకరణ చేయటం మినహా రైల్వే అధికారులు పేదలకు చేసింది ఏమీ లేదు.

–కె.వి.ఆర్.మోహన్ చందు, సీపీఎం మండల కార్యదర్శి శావల్యాపురం

అన్నీ రైళ్లు ఆపాలి



గతంలో మాదిరిగానే అన్నీ రైళ్లు శావల్యాపురం రైల్వే స్టేషనులో ఆగాలి. రైలు ప్రయాణం వలన దూర ప్రాంతాలకు వెళ్లే వారందరికీ సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. ప్రయాణపు చార్జీలు చాలా తక్కువగా ఉంటాయి. రైళ్లు నిలుపుదల లేకపోవటం వలన వినుకొండ, నరసరావుపేట వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. రైలు ప్రయాణం అందరికీ అందుబాటులో ఉండాలి. అధికారులు స్పందించి గతంలో మాదిరిగానే అన్నీ రైళ్లు ఆపాలి.

–భీమని అంకారావు, గుంటుపాలెం

పోలీసు స్టేషనులో బైకు దొంగతనం!

శావల్యాపురం: పోలీసుస్టేషనులో బైకు మాయమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం ప్రకారం.. శావల్యాపురంలో పోలీసు స్టేషను కూతవేటు దూరంలో ఉన్న పోలేరమ్మ దేవాలయంలో చోరీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తి ఒకరు బైకుపై వచ్చాడు. అదే సమయంలో స్థానికులు గుర్తించి సదరు వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేయగా తప్పించుకొని పారిపోయాడు. గ్రామస్తులు బైకును (ఏపీ 07 బీఎస్ 3406) స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషనులో అప్పగించారు. అయితే స్టేషను బయట ఉంచిన ఈ బైకును ఎవరో అపహరించారు. సోమవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విచ్చేసిన వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్‌ను గ్రామస్తులు అడగ్గా బైకు సత్తెనపల్లికి చెందిన సంతోష్‌దిగా గుర్తించామన్నారు. దీనిపై విచారణ జరుగుతోందని నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

భోజనశాల షెడ్డూ ఏర్పాటు చేయండి

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో భోజనశాల షెడ్డును మంజూరు చేయించాలని ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్ సోమవారం లిఖిత పూర్వకంగా సోమవారం కోరారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల్లో ప్రతిరోజు 500 మంది విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తింటున్నారని అందరు ఒకచోట తినే విధంగా భోజనశాల మంజూరు చేయాలన్నారు. అలాగే విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ నిమిత్తం ఆధార్ సెంటరును కూడా ఏర్పాటు చేయించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల భోదకులు బెజవాడ నాగేశ్వరరావు ఉన్నారు.

హద్దురాళ్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలి



సర్వేలో పాల్గొన్న మండల సర్వేయర్, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేటరూరల్: యల్లమంద గ్రామంలో భూమి సర్వేచేసి ఏర్పాటుచేసిన హద్దురాళ్లు తొలగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన దూళిపాళ్ల చంద్రశేఖర్‌కు 2.10 ఎకరాల భూమి ఉందని, ఇందులో 1.80 ఎకరాల విక్రయించగా 30 సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమించగా దీనిపై ప్రజాసంఘాల నాయకులు సహకారంతో రెవెన్యూ అధికారులకు సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సోమవారం మండల సర్వేయర్ శ్రీకాంత్ పాటు గ్రామ సర్వేయర్లు సర్వేలో పాల్గొని 30 సెంట్ల స్థలానికి హద్దురాళ్లు ఏర్పాటుచేశారు. అయితే ఆక్రమణదారులు ఈ హద్దురాళ్లు తొలగించే అవకాశం ఉందని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శివయ్యభవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) వినుకొండ నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం విద్యార్థుల పోరాటం వల్లే జరుగుతుందన్నారు. దేశ స్వాతంత్ర్యంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్ ఎన్నో పోరాటాలు నిర్వహించిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా పెద్దేటి అభిషేక్, బోధనం శ్రీనివాస్, మరో 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్‌జీ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన శావల్యాపురం తహసీల్దారు



తహసీల్దారు కె.సుజాతను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

శావల్యాపురం: మండల నూతన తహసీల్దారు కె.సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు సారథ్యంలో కార్యాలయ అధికారులు వీఆర్వోలు ఘనంగా స్వాగతం పలికి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నూతన తహసీల్దారు సుజాత విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ పరంగా మెరుగైన సేవలు సకాలంలో పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పెరిసోముల నాసరయ్య, మండల సర్వేయర్ యం.రాజు, సీనియర్ సహాయకులు చంద్రబాబు, వీఆర్వోలు ఉప్పులూరి చిన మంగయ్య,మల్లెల రాధ, వీరవల్లి నాగసంతోషలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు గీతా లక్ష్మి



గీతా లక్ష్మి



సెలక్షన్స్‌లో ఖోఖో ఆడుతున్న గీతా లక్ష్మి

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని పూజల గీతా లక్ష్మి అండర్–17 ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బీఎం. సుభాని తెలిపారు. ఈ మేరకు నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అండర్–17 గుంటూరు జిల్లా ఖోఖో జట్టు సెలక్షన్స్‌లో ఎంపికైందన్నారు. నవంబర్ 2వ తేదీన అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జట్టులో పాల్గొని ఆడ నున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వై. సైదయ్య తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన గీతా లక్ష్మీని పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోపాల్

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.గోపాల్ అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో సీపీఎం మండల మహా సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని, గ్రామంలో బేతంరాజు చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ సత్వరమే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు పి.పెద్దిరాజు, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, ఈవూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పందెంరాయుళ్ల అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని కారుచోల సమీపంలో కోడిపందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై బాలకృష్ణ, సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12700లు నగదును, పందెం కోడిని స్వాధీనం చేసుకున్నారు. మరికొంతమంది పందెం రాయుళ్ళు పరారైనట్లు తెలిసింది.

నేడు పత్తి రైతులకు అవగాహన కార్యక్రమం

నాదెండ్ల: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి పత్తి పండించే రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎంసీ కార్యదర్శి యు.జోగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీసీఐ జనరల్ మేనేజర్‌తో పాటూ బయ్యర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది హాజరౌతున్నట్లు చెప్పారు. త్వరలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్లాస్టిక్ గోతాల్లో పత్తిని తీసుకురాకుండా, గోనె సంచుల్లో మాత్రమే తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులు తొలగించాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా మద్యం వ్యాపారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గుడి, బడికి 100 మీటర్లు దూరంలో ఉండేలా మద్యం షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసిన షాపులు జనవాసాల మధ్య ఉండటంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు వాటిని తొలగించి వేరే ప్రాంతాలలో నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువులకు కొరత లేదు

శావల్యాపురం: మండలంలోని 11 రైతుసేవా కేంద్రాలు, సొసైటీల్లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ డీఏపీ–118 మెట్రిక్ టన్నులు, యూరియా–84 మెట్రిక్ టన్నులు, వివిధ రకాల ఎరువులు నిల్వలు–205 మెట్రిక్ టన్నులు ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. రైతులు అపోహలు నమ్మరాదన్నారు.ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, వీఏఏ వెంకయమ్మలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మున్సిపల్ కార్మికులు
- కార్యాలయం ఎదుట ధర్నా



కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నరసరావుపేట: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వచ్చే 15 రోజుల వ్యవధిలో పరిష్కరించకపోతే ఆందోళన చేయటంతో పాటు సమ్మె చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి శిలార్ మసూద్ మాట్లాడుతూ పట్టణ విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్య ఏళ్ల తరబడి పెంచటంలేదని, కార్మికులను ఇతర పనులకు వాడుకోవటం వలన మిగిలిన కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు, వాహనాల మరమ్మతులు, పనిముట్లు, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈపీఎఫ్ అమలులో నాలుగు ఖాతాలను ఒకే ఖాతాకిందకు తీసుకురావాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆప్కాస్ ద్వారా రిటైర్ అయిన వారి కుటుంబంలోని పిల్లలకు ఉపాధి చూపించాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు స్కిల్డ్, అన్‌స్కిల్డ్ విధాన పరంగా జీతాలు చెల్లించాలని, ప్రతి నెలా ఏడవతేదీలోపు జీతాలు అందజేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మె జీతం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంపుదల చేయాలని కోరారు. విజయవాడ వరదల ముంపు సందర్భంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులు నివారించాలని అన్నారు. నాయకులు డి.యోహాను, టి.మల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.


17న రెడ్డి కార్తిక వనసమారాధన



సమావేశంలో పాల్గొన్న సమితి నాయకులు

వినుకొండ(నూజెండ్ల): శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి సమావేశం స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సమితి ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ నవంబరు 17వ తేదీన రెడ్డి కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నామని అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. రెడ్డి సంఘం భవనం, సత్రం పనులు చాలా వేగంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా పేద రెడ్డి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ నవంబరు 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేరోజు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి సెక్రటరీ పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ కర్నాటి చెన్నకేశవరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, గంధం బాలిరెడ్డి, కేసరి ప్రకాష్‌రెడ్డి, తుపాకుల కొండల్‌రెడ్డి, సోము వెంకటేశ్వరరెడ్డి, రొడ్డా శ్రీనివాసరెడ్డి, బిక్కం వెంకటనారాయణరెడ్డి, మాలపాటి భాస్కరరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, బలరాం రెడ్డి, ఎరుకల రెడ్డి, సంజీవరెడ్డి, జయకృష్ణా రెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రత అందరి బాధ్యత



పోక్సో సదస్సులో మాట్లాడుతున్న సీఐ చరణ్

నరసరావుపేట ఈస్ట్: ఆడపిల్లల భద్రత అందరి బాధ్యతగా గుర్తెరగాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు పోక్సో చట్టంపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంభా నరసింహారావు అధ్యక్షత వహించారు. సదస్సులో సీఐ చరణ్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ ఆడపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత వారితో మాట్లాడాలని తెలిపారు. పిల్లలు చెప్పే ప్రతి విషయాన్ని వినటంతో పాటు వారి భావాలను అర్థం చేసుకొని మెలగాలని కోరారు. స్నేహ పూర్వకమైన వాతావరణంలో ఆడపిల్లలు స్వేచ్ఛగా ఎదిగేలా చూడాలని తెలిపారు. స్నేహానికీ, తాత్కాలికంగా ఏర్పడే మోహానికి మధ్య తేడాలను అర్థమయ్యేలా తెలియ చెప్పాలన్నారు. చిన్నారులు తమకు ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు పెద్దలకు తెలియచేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

అర్హులకు న్యాయం జరగాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



శావల్యాపురం: ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేసి అర్హులందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రెవెన్యూ–52, హౌసింగ్–45, పంచాయతీరాజ్–32 శాఖల వారీగా ప్రజల నుంచి స్వీకరించామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, తహసీల్దారు కె.సుజాత, సీడీపీవో అనురాధ, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి, మండల నాయకులు గుంటూరు సాంబశివరావు, గడుపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, బొల్లా పేరయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, దోడ్డా ఏడుకొండలు పాల్గొన్నారు.